బాధితుల గుర్తింపులోనూ పక్షపాతమేనా?

- ఎన్యూమరేషన్ జాబితాలో రాజకీయం
- రాజకీయ పార్టీలుగా విభజన

అంబాపురం(విజయవాడరూరల్): వరద బాధితులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంలో విషయంలో కూడా అధికారపార్టీకి చెందిన నాయకులు పక్షపాత వైఖరి అవలంభిస్తున్నారు. ఇళ్లు ముంపునకు గురైతే ప్రభుత్వం రూ.25 వేల ఆర్థిక సహాయం ప్రకటించింది. పాక్షికంగా ముంపునకు గురైతే పది వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

రాజకీయ పార్టీలుగా విభజించి..

దీన్ని అవకాశంగా తీసుకుని అధికార పార్టీకి చెందిన నాయకులు తమ బంధువులకు, పార్టీకి అనుకూలంగా జాబితాను తారుమారు చేస్తున్నారు. బాధితలను బాధితులుగా చూడకుండా రాజకీయపార్టీలుగా విభజించి జాబితాలు సిద్ధం చేస్తున్నారు. పాక్షికంగా వరద ముంపులో ఉన్నవారిని పూర్తిగా వరద ముంపులో ఉన్నట్లు అనగా 25 వేల రూపాయల సహాయం అందేలా లబ్ధిదారుల జాబితాను అంబాపురం గ్రామంలో సిద్ధం చేశారు. వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్న బాధితుల పేర్లను పాక్షింగా వరద ముంపులో ఉన్నట్లు జాబితాలను తయారు చేయడంతో బాధితులు మదన పడుతున్నారు.

ఇళ్లు వదిలి వెళ్లినవారి విషయంలోనూ..

వరదల్లో ఇళ్లు పూర్తిగా మునిగిపోవడంతో ఇళ్లల్లో లేకుండా వేరే చోట తలదాచుకొని, ఇప్పుడు సొంత ఇంటికి వచ్చిన కుటుంబాల పేర్లను పాక్షికంగా దెబ్బతిన్న బాధితుల జాబితాలో సిద్ధం చేసినట్లు ఆరోపిస్తున్నారు. అంబాపురం గ్రామంలో మొత్తం 1,925 కుటుంబాలు వరద ముంపులో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు జాబితాను సిద్ధం చేశారు. సిబ్బంది తుది విడతగా రీ ఎన్యూమరేషన్ చేసి మలి జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఆ జాబితా తయారీలో కూడా అధికార పార్టీ చెప్పిన వారి పేర్లు మాత్రమే రాయాలని టీడీపీ నాయకులు హుకుం జారీ చేశారని తెలుస్తోంది. ఈ విషయమై తహసీల్దార్ బి.సుగుణను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోనుకు అందుబాటులో లేరు.



అంబాపురంలో ఓ ఇంటిలో చేరిన వరద నీరు (ఫైల్)

రాజకీయాలు తగదు..



ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో రాజకీయాలు తగదు. ప్రజలు నష్టపోయిన ఇలాంటి పరిస్థితుల్లో మానవతా దృక్పథంతో ఆదుకోవాలి. వారికి చేయూత ఇవ్వాలి. రాజకీయాలకతీతంగా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయాలి. అంతేకాని పక్షపాతం చూపడం తగదు.

–నల్లమోతు చంద్రశేఖర్

అందరికీ న్యాయం చేయాలి



వరదల్లో పూర్తిగా నష్టపోయిన బాధితులకు పాక్షికంగా నష్టపోయినట్లు చూపడం మంచిపద్ధతి కాదు. పాక్షికంగా నష్టపోయిన వారి పేర్లను పూర్తిగా నష్టపోయినట్లు జాబితాలను తయారు చేయడం పక్షపాత వైఖరి అవుతుంది. నష్టపోయిన వారందరికీ న్యాయం చేయాలి. ప్రభుత్వ సహాయం అందించాలి.

–నందేటి విజయ్‌కుమార్, అంబాపురం

పెనమలూరు: కృష్ణానది వరదల కారణంగా వరద నీటిలో మునిగిన గృహాల యజమానులు ప్రభుత్వ పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. గృహాల యజమానులకు పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటన చేయటంతో అధికారులు సర్వే చేసినా నష్టపరిహారం మాత్రం ఇప్పటివరకు అందలేదు.

సాయం కోసం ఎదురు చూపులు

- 2,442 గృహాలు
- 856 వాహనాలు వరదలో మునక

వివరాల్లోకి వెళితే..

మండల పరిధిలో కృష్ణానది పరీవాహక ప్రాంతంలో యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో గృహాలు వరద నీటిలో పూర్తిగా మునిగిపోయాయి. మొదటి అంతస్తు వరకు వరద నీరు వచ్చి ఇంట్లో విలువైన ఫర్నీచర్, వస్తువులు, వాహనాలు ధ్వంసమయ్యాయి. విలువైన వస్తువులు వరద నీటిలో కొట్టుకు పోయాయి. కట్టు బట్టలతో నివాసితులు బయటకు వచ్చారు. వరద తగ్గిన తరువాత ఇళ్లకు వెళ్లి చూడగా ఇంట్లో బురద తప్ప ఏమీ మిగలలేదు. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు.

నష్టంపై సర్వే పూర్తి..

ప్రభుత్వం బాధితులను ఆదుకుంటామని ప్రకటించి ఇంటింటి సర్వేకు ఆదేశించింది. గత వారం రోజులుగా అధికారులు సర్వే చేశారు. ప్రస్తుతం బాధితుల జాబితా ప్రకటించారు. అధికారుల లెక్కల ప్రకారం పెదపులిపాకలో 1,001 గృహాలు, యనమలకుదురులో 1,441 గృహాలు వరద నీటిలో మునిగాయని తేల్చారు. పెదపులిపాకలో 315 వాహనాలు, యనమల కుదురులో 541 వాహనాలు వరద నీటిలో మునిగాయని నివేదిక రూపొందించారు. వరద నీటిలో గృహాలు మునగటం వలన ఇళ్లకు రూ.లక్ష నుంచి 5 లక్షల వరకు నష్టం వాటిల్లింది. పరిహారం ఎంత అందుతుందోనని బాధితులు ఎదురు చూస్తున్నారు.

పలువురు అధికారుల బదిలీ

ఉంగుటూరు: మండలంలో పలు శాఖల అధికారులు సోమవారం బదిలీ ఉత్తర్వులు అందుకున్నారు. స్థానిక ఎంపీడీవో శేషగిరిరావు ఉయ్యూరు బదిలీకాగా గన్నవరం ఎంపీడీవో ఈ.సత్యకుమార్ ఉంగుటూరు ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టనున్నారు. డెప్యూటీ తహసీల్దార్ శ్రీలత చల్లపల్లి డెప్యూటీ తహసీల్దారుగా జగ్గయ్యపేట డెప్యూటీ తహసీల్దారు యూ కిషోర్‌కుమార్ ఉంగుటూరు డెప్యూటీ తహసీల్దారుగా రానున్నారు. రీసర్వే డెప్యూటీ తహసీల్దార్ షఫీకుమార్ ఉయ్యూరు పీడీఎస్‌కు బదిలీ అయ్యారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ ఎస్.బసవయ్య కంకిపాడు బదిలీకాగా ఆయన స్థానంలో గన్నవరం సూపరింటెండెంట్ ప్రసాద్ బదిలీపై రానున్నారు. తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సుమన్ మొవ్వ వెళ్లగా గన్నవరం జూనియర్ అసిస్టెంట్ చైతన్యకృష్ణ ఉంగుటూరు, మండల పరిషత్ టైపిస్ట్ శ్రీనివాసరావు విజయవాడ పీఆర్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. వెలుగు డీఆర్‌డీఏ ఏపీఎం ఎం.సాంబశివరావు తోట్లవల్లూరు బదిలీ కాగా బాపులపాడు ఏపీఎం ఎస్.భూపతిరావు ఉంగుటూరుకు బదిలీ అయ్యారు. సీసీ నిమ్మగడ్డ వెంకటరత్నకుమారి బాపులపాడు బదిలీ కాగా ఇద్దరు సీసీలు ఆరుణకుమారి, మాణిక్యం ఉంగుటూరు బదిలీపై రానున్నారు.

దావులూరు టోల్‌ప్లాజాను ఢీకొన్న బస్సు

పలువురికి స్వల్పగాయాలు

కంకిపాడు: దావులూరు టోల్‌ప్లాజాను ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొంది. ఈ సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన వివరాలు, సేకరించిన సమాచారం మేరకు..మచిలీపట్నం నుంచి విజయవాడ వైపు వస్తున్న ఆర్టీసీ హైర్ బస్సు దావులూరు టోల్‌గేట్ వద్దకు చేరుకోగానే డ్రైవరు దోనే ప్రకాష్ నిర్లక్ష్యం కారణంగా టోల్‌ప్లాజాను ఢీకొంది. ఘటనలో బస్సు ఇంజిన్ భాగం పూర్తిగా ధ్వంసమైంది. డ్రైవరు బస్సు బయలుదేరిన తరువాత అర్ధగంటకు పైగా ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా బస్సును నడపటం వల్లే టోల్‌ప్లాజాను ఢీకొందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బస్సులో సీట్లలో కూర్చున్న ఎనిమిది మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరు స్థానికంగా వైద్యం చేయించుకుని గమ్యస్థానాలకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న కంకిపాడు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.సందీప్ తెలిపారు.



దావులూరు టోల్‌గేట్‌ను ఢీకొనటంతో ధ్వంసమైన బస్సు ఇంజిన్ భాగం

అంతరిక్షంపై అవగాహన అవసరం

కంకిపాడు: అంతరిక్షంపై అవగాహన అవసరమని ఏపీసీఓఎస్‌టీ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ మెంబర్ సెక్రటరీ కృష్ణమూర్తి అన్నారు. విజ్ఞానభారతి, ఇస్రో సంయుక్తంగా నిర్వహించిన స్పేస్ ఆన్ వీల్స్ కార్యక్రమం సోమవారం ఈడుపుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి ప్రారంభించారు. జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా పర్యవేక్షణలో స్పేస్ ఆన్ వీల్స్ కార్యక్రమం చేపట్టారు. సమన్వయకర్తలు సీహెచ్ పద్మావతి, ఎం.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి రావి సురేష్‌బాబు పర్యవేక్షణలో విద్యార్థులు అంతరిక్షం అద్భుతాలను తెలుసుకున్నారు. ఇస్రో సాధించిన విజయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, హెచ్ఎం పద్మావతిభాయ్ తదితరులు పాల్గొన్నారు.



అంతరిక్షంలో దృశ్యాలను తిలకిస్తున్న చిన్నారులు

నిర్దిష్టమైన ప్రణాళికతో అద్భుత విజయాలు

పటమట(విజయవాడపశ్చిమ): నిర్దిష్టమైన ప్రణాళికతో వ్యాపార, వాణిజ్య రంగాల్లో అడుగులు వేస్తే అద్భుతమైన విజయాలు సొంతం చేసుకోవచ్చని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చిన్న, మధ్య తరహా పరిశ్రమల అసోసియేషన్ అధ్యక్షుడు వాసిరెడ్డి మురళీకృష్ణ తెలిపారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల మేనేజమెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో మీట్ ది సీఈవో కార్యక్రమంలో భాగంగా వ్యాపార, వాణిజ్య రంగాల్లో స్థాపన, రాణింపు అంశాలపై ప్రసంగాన్ని నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన మురళీకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగం చేయటం అనే ఆలోచన నుంచి సొంతంగా వ్యాపారం చేయాలనే తలంపును విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. వ్యాపారాన్ని ప్రారంభించేందుకు కొంత అనుభవం, మరికొన్ని నైపుణ్యాలు అవసరమన్నారు. మొదటి విద్యార్థులు ఎంచుకున్న వ్యాపార రంగానికి సంబంధించి కొంత అనుభవాన్ని సంపాదించాలని చెప్పారు. వ్యాపారానికి మూలధనంతో పాటుగా కొంత నష్ట భయాన్ని ఎదుర్కొనే తత్వాన్ని సైతం పెంపొందించుకోవాలని స్పష్టం చేశారు. వ్యాపారంలో నష్టం రావటం సహజమన్నారు. అయితే నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగినప్పుడు చక్కని లాభాలను సాధించవచ్చని తెలిపారు. అపూర్వమైన అభ్యున్నతిని జీవితంలో సాధించేందుకు అనేక అవకాశాలు ఎదురు చూస్తున్నాయని వివరించారు. ఆ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, పీజీ డైరెక్టర్ ఎస్.వెంకటేష్, ఎంబీఏ విభాగాధిపతి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాసిరెడ్డి మురళీకృష్ణ

ఆలయ ఈవోగా ఆంజనేయస్వామి

మచిలీపట్నంటౌన్: స్థానిక బచ్చుపేటలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవోగా సమ్మెట ఆంజనేయస్వామి నియమితులయ్యారు. విజయవాడలోని గుంటూరు సీతారామయ్య అన్నసత్రం ఈవోగా చేస్తున్న ఆయన ఇక్కడకు బదిలీ చేశారు. గతంలో నగరంలోని రామలింగేశ్వరస్వామి, రంగనాయకస్వామి, గొడుగుపేట వేంకటేశ్వరస్వామి తదితర ఆలయాలకు ఈవోగా పనిచేశారు. ప్రస్తుతం మళ్లీ ఆయనను మచిలీపట్నంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఈవోగా నియమించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయం 6.30 గంటలకు, 8 గంటలకు, 9.30 గంటలకు, 10.30 గంటలకు రుద్రాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారికి పంచహారతులు ఇచ్చి స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు.

మొక్కలను సంరక్షించుకోవాలి



కంకిపాడు: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని మస్జిదె అలీ మస్జీద్ ఇమామ్ ఖాదర్ అన్నారు. ఈడుపుగల్లు గాంధీనగర్‌లోని మస్జిదె అలీ మస్జీద్ ప్రాంగణంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఇమామ్ ఖాదర్ మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కల సంరక్షణ చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మౌజన్ మౌలాలీ, మసీదు కమిటీ కార్యదర్శి గూడ్‌సాహెబ్, కమిటీ ప్రతినిధులు సుభాన్‌వలీ, సలీమ్, బాజీ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌గా భవానీ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్‌గా పి.భవానీ ప్రసాద్ సోమవారం విధుల్లో చేరారు. గతంలో తాడిగడప మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన ఎం.వెంకటేశ్వరరావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో భవానీ ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఆయన తాడిగడప కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. కమిషనర్ భవానీ ప్రసాద్‌ను కార్యాలయ సిబ్బంది పలువురు కలిసి పరిచయం చేసుకున్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

పెనమలూరు: జిల్లాలో పలు చోరీ కేసుల్లో నిందితుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి ఎల్ఎస్ గార్డెన్స్ వద్ద రమేష్‌కుమార్ అనే వ్యక్తి ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 17వ తేదీన దొంగలు షాపు తాళాలు పగులకొట్టి దాదాపు రూ.2 లక్షల విలువ చేసే విద్యుత్‌వైర్లు చోరీ అయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారించగా నిందితుడు కైకులూరు మండలం అటపాక గ్రామానికి చెందిన ఆరేపల్లి దుర్గారావుగా గుర్తించారు. అతనిని ఆదుపులోకి తీసుకొని విచారించగా పలు దొంగతనాల వ్యవహారం బయటపడింది. దుర్గారావు ఈ నెల 14వ తేదీన గుంటూరులో బంగారం, ఫ్యాన్సీ షాపుల్లో చోరీ చేశాడు. 15వ తేదీన గన్నవరం గాంధీబొమ్మ సెంటర్‌లో పెయిటింగ్ షాపులో, అదే రోజు రాత్రి మంగళగిరిలో రెండు ఆటోమొబైల్ షాపుల్లో, 17వ తేదీన రాత్రి విజయవాడ ప్రభుత్వాస్పత్రి వద్ద హార్డవేర్‌షాపులో, 18వ తేదీ రాత్రి గుంటూరు కొత్తపేట వద్ద ఎయిర్‌టెల్ షాపులో చోరీ చేశాడు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

క్లుప్తంగా

వరద బాధితుల వివరాల ప్రదర్శన

పెనమలూరు: మండల పరిధిలో కృష్ణానది వరదల కారణంగా వరద ముంపునకు గురైన బాధితుల వివరాలు ప్రకటించామని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ.. ఆగస్టు 30వ తేదీ నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు కృష్ణానదిలో వచ్చిన వరదల కారణంగా మండల పరిధిలోని యనమలకుదురు, పెదపులిపాక గ్రామాల పరిధిలో నదీ పరీవాహక ప్రాంతంలో ఉన్న ఇళ్లు, వాహనాలు వరద ముంపునకు గురయ్యాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే నిర్వహించామని తెలిపారు. నీట మునిగిన ఇళ్లు, వాహనాల వివరాలు నమోదు చేసి జాబితా ప్రకటించామన్నారు. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయం, పెదపులిపాక, యనమలకుదురు సచివాలయాల్లో వివరాలు ఉంచామన్నారు. బాధితులు జాబితా చూసుకోవాలని, పేర్లు నమోదు కాని వారు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అధార్ కార్డుకు బ్యాంకు అకౌంట్ లింక్ చేసి ఉండాలని సూచించారు.

వరద బాధితులకు విద్యార్థుల సాయం



హనుమాన్‌జంక్షన్ రూరల్: బుడమేరు వరద బాధితులకు సాయం అందించేందుకు బాపులపాడు మండలం రేమల్లేలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సేకరించిన సొమ్మును సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందించారు. పాఠశాల విద్యార్థులంతా కలిసి సేకరించిన రూ.25,205 నగదును డీడీ రూపంలో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు సోమవారం అందజేశారు. వీరవల్లిలో ఓ కార్యక్రమానికి వచ్చిన యార్లగడ్డను రేమల్లే జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి డీడీ అందించారు. విద్యార్థులను ఆయన అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.లూథర్‌పాల్, ఉపాధ్యాయులు దారపురెడ్డి భాస్కరరావు, వెలమర్తి రవిబాబు, పరసా రాజేష్ పాల్గొన్నారు.

మనోభావాలను గౌరవించాలి

కంకిపాడు: దళితుల మనోభావాలను గౌరవించాలని జేసీఎస్ మాజీ చైర్మన్, కంకిపాడు ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి కోరారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. చిరంజీవి మాట్లాడుతూ కంకిపాడు లాకుగూడెం, దళితవాడ, హరిజనవాడ ప్రాంతాలుగా పిలిచేవారన్నారు. ఇప్పటి వరకూ వాడుకలో ఉన్న ఈ పదాలను ఇకపై వాడవద్దన్నారు. జిల్లా కలెక్టర్ ఆమోదయోగ్యంతో గెజిట్ విడుదలయ్యిందని, ఈ ప్రాంతాన్ని కంకిపాడు అంబేడ్కర్ నగర్‌గా పిలవాలని సూచించారు. ఈ ప్రాంత ప్రజానీకం మనోభావాలను గౌరవించాలని, పత్రికలు, సోషల్ మీడియా ప్రతినిధులు సైతం కంకిపాడు అంబేడ్కర్ నగర్‌గా రాయాలని కోరారు.

సేవాసదన్ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న తిరుపతమ్మ సేవాసదన్ నిర్మాణానికి పట్టణానికి చెందిన జాస్తి కనకారావు, కళ్యాణి దంపతులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ మేరకు సోమవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు విరాళం నగదును అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ..ఆలయ కార్యక్రమాల నిర్వాహణ నిమిత్తం తిరుపతమ్మ సేవాసదన్‌ను నిర్మిస్తున్నట్టు తెలిపారు. సేవాసదన్ నిర్మాణానికి భక్తులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి తమవంతు సహకారం అందిస్తుండడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. ఆలయ కమిటీకి చెందిన జాస్తి ఫణిశేఖర్, పొట్ల శివలీల, పాతూరి దుర్గారాణి, కాసరనేని నాని, జాస్తి శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



కంకిపాడు: ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కంకిపాడు సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు అన్నారు. నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కంకిపాడు సీహెచ్‌సీలో సఫాయ్ మిత్ర–ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరం సోమవారం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కిషోర్‌బాబు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంజయ్, వైద్యులు డాక్టర్ తేజస్విని, డాక్టర్ ఇబ్రహీం, డాక్టర్ ధనూషా, డాక్టర్ కృపాలిన్, డాక్టర్ రుచిత, హెల్త్ సూపర్‌వైజర్ యువి పురుషోత్తంరాజు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంట నష్ట పరిహారానికి సంబంధించిన ఈకేవైసీ వివరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి ఎస్ఎల్.తేజస్వి పర్యవేక్షణలో రైతులకు అవగాహన కల్పించారు. అధిక వర్షాలు, వరదల కారణంగా మండలంలో 7,600 ఎకరాలకు సంబంధించి 7,890 మంది రైతులకు పంట నష్టం జరిగిందని తెలిపారు. వీరిలో 7,540 మంది రైతులు మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారని చెప్పారు. మిగిలిన రైతులు కూడా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే పంట నష్టపరిహారం అందుతుందని తెలిపారు. సదరు రైతులకు డిజిటల్ పేమెంట్ రూపంలో వారి బ్యాంక్ ఖాతాలకు ప్రభుత్వం నష్టపరిహారం జమ చేస్తుందన్నారు. పలువురు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో తేజస్వి

పౌష్టికాహారంతోనే మాతాశిశు సంరక్షణ

కంకిపాడు: పౌష్టికాహారంతోనే మాతా శిశు ఆరోగ్య సంరక్షణ సాధ్యమని ఐసీడీఎస్ కంకిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి అన్నారు. మండలంలోని నెప్పల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు సంప్రదాయబద్ధంగా పూలు, పండ్లు, ఆకువక్క, నూతన వస్త్రం అందించారు. అన్నామణి మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవటం ద్వారా చిన్నారుల్లో, గర్భిణుల్లో ఆరోగ్యం వృద్ధి చెందుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నెప్పల్లి, కుందేరు, చలివేంద్రపాలెం, కందలంపాడు గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత కొండపల్లికి నివాళి

ఉయ్యూరు: వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ ప్రధాన కార్యదర్శి కొండపల్లి రమేష్ (49) అంతిమయాత్ర సోమవారం అశ్రునయనాల నడుమ సాగింది. స్నేహితులతో కలిసి గోవా వెళ్లిన రమేష్ గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. రమేష్ భౌతికకాయాన్ని విమానంలో సోమవారం గన్నవరం విమానాశ్రయానికి, అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో స్వగ్రామమైన ఉయ్యూరుకు తరలించారు. ఉయ్యూరులోని సుందరమ్మపేటలోని నివాసం వద్ద కొండపల్లి భౌతికకాయాన్ని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, నాయకులు జంపాన కొండలరావు, పెనుమూడి సంజయ్, ఊర నాగిన్, కౌన్సిలర్లు గోన మదన్, పైలా శ్రీనివాసరావు, లక్ష్మి తదితరులు సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. రమేష్ భౌతికకాయాన్ని చూసి కుటుంబ సభ్యులు, స్థానికులు, స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. స్థానిక శ్మశానవాటికలో రమేష్ భౌతికకాయానికి అంత్యక్రియలు జరిగాయి. అంతిమయాత్రలో పట్టణవాసులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



రమేష్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న పెనమలూరు ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి

వికాస్ కాలేజీకి అటానమస్

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌కి జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీ కాకినాడ సోమవారం యూజీసీ అటానమస్ స్టేటస్ మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులను జారీచేసింది. వైస్ ఛాన్సలర్ డాక్టర్ కేవీఎస్ జి.మురళీకృష్ణ జేఎన్టీయూకే అటానమస్ స్టేటస్ కన్ఫర్మేషన్ ఉత్తర్వులను కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు. అటానమస్ స్టేటస్ వలన కళాశాలలో మరింత నాణ్యతాప్రమాణాలతో కూడిన విద్యను, పెద్ద కంపెనీలలో నియామకాలు ఎక్కువగా జరగటానికి ఆ కంపెనీలకు కావాల్సిన సిలబస్‌ను యూనివర్సిటీ అనుమతితో బోధించేందుకు అవకాశం ఉంటుందని సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి తెలియజేశారు. ప్రతిష్టాత్మకమైన అటానమస్ స్టేటస్‌ను సాధనకు సహకరించిన అధ్యాపకులకు, విద్యార్థినీ, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



అటానమస్ ఉత్తర్వులను స్వీకరిస్తున్న ఎన్. సత్యనారాయణరెడ్డి

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఉంగుటూరు: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన వీరపనేనిగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నవరం మండలం వీరపనేని గూడెంకు చెందిన షేక్ బాజీ (38) ఆటో నడుపుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. మద్యానికి బానిసై అప్పులు ఎక్కువ చేసి ఆటో వాయిదాలు చెల్లించకపోవడంతో ఆటోను ఫైనాన్సర్ స్వాధీనం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం బాగా మద్యం సేవించి ఇంటికి వెళ్లడంతో ఏపనికీ వెళ్లకుండా ఇలా తాగి తిరిగితే కుటుంబం ఎలా గడవాలని భార్య కరీమున్నీసా నిలదీసింది. దీంతో బాజీ భార్యతో ఘర్షణపడి అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతుకుతుండగా గ్రామ శివారులోని పోలవరం కాలువలో సోమవారం శవమై కనిపించాడు. భార్యా ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా ఆత్కూరు ఎస్ఐ చావ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుల్లేరు కాలువలో..

ఉయ్యూరు: పుల్లేరు కాలువలో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన కథనం మేరకు..విజయవాడ సత్యనారాయణపురం ప్రాంతంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన నంద్యాల తేజ (23) ఈనెల 22న వ్యక్తిగత కారణాల రీత్యా స్నేహితులతో కలిసి ఉయ్యూరు బస్టా సమీపానికి చేరుకున్నానని తల్లిదండ్రులకు లొకేషన్ కూడా షేర్ చేశాడు. కంగారు పడ్డ తల్లిదండ్రులు సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉయ్యూరు బస్టాండు సమీపానికి రాగానే పుల్లేరు కాలువ పక్కన యువకుడు నడిపిన బైక్ కనిపించింది. వెంటనే ఉయ్యూరు పోలీసుల సమన్వయంతో పుల్లేరు కాలువలో గాలింపులు జరిపారు. కాలువలో తేజ మృతదేహం లభ్యమైంది. సత్యనారాయణపురం పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కోడి పందేలు నిర్వహిస్తున్న 12 మంది అరెస్ట్

పెనమలూరు: కోడి పందేలు ఆడుతున్న 12 మంది వ్యక్తులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వణుకూరు కాలనీలో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ రాజేష్ సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో కోడి పందేలు ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు పుంజులు, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

డాక్యుమెంట్స్ పోయినవి

గుంటుపల్లి రంగారావు (లేటు) గారి భార్య గుంటుపల్లి కృష్ణకుమారి గారు కానూరు లోని వారి ఆస్తి తాలూకా నెం.353/1980 గల ఒరిజినల్ దస్తావేజు 15-09-24న కానూరు నుండి కామయ్యతోపు వెళ్ళే రోడ్డులో పోయినది. దొరికిన వారు ఈ క్రింది నంబరుకు తెలియజేయ ప్రార్థన.

✆ 94916 12696